RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 76 | పేజీలు : 08 | మంగళవారం | 24-03-2026 | వెల :4/-

PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

- హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం: రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్
- భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తామని వెల్లడి
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్న సీఎం



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా

2



2

### ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే

## రైతుభరోసా

- బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు
- ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్న హరీశ్ రావు
- తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత రూ.12 వేలకు తగ్గించారని ఆరోపణ
- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని విమర్శ



2

### బీసీ నాయకుడు

## ముఖ్యమంత్రి అవుతాడు

- ముఖ్యమంత్రి పదవిపై మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తులో బీసీ నాయకుడు సీఎం అవుతాడని వ్యాఖ్య
- కేసీఆర్, రామచందర్ రావులకు అలా చెప్పే దమ్ముందా అని నిలదీత
- బీజేపీ నాయకులు బీసీలకు వ్యతిరేకులు అని విమర్శ



2

### ప్రభుత్వ ఉద్యోగులకు

## గుడ్ న్యూస్

- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన మల్లు భట్టి విక్రమార్క
- మూడు డీఏ బకాయిలను త్వరలోనే క్లియర్ చేస్తామన్న మల్లు భట్టి
- గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని విమర్శ
- ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు విడుదల చేస్తున్నామని వెల్లడి



2

### రేవంత్ రెడ్డిని నేనే

## ముఖ్యమంత్రిని చేశా

'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా : మల్లారెడ్డి

- వెండి తెరపై సీఎం రోల్ పోషించాలని ఉందన్న మల్లారెడ్డి
- తాను, రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని వ్యాఖ్య
- 'ఉస్తాద్ భగత్ సింగ్'లో తనకు విలన్ ఆఫర్ వచ్చిందని వెల్లడి

**హైదరాబాద్ సహా తెలంగాణలో పలుచోట్ల పెట్రోల్ బంకులు మూత!**

## ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి



2

- లోక్ సభలో ప్రధాని మోదీ ప్రసంగం
- పశ్చిమాసియా సంక్షోభం భారత్‌కు ఆర్థికంగా, భద్రతాపరంగా పెను సవాల్ అని ప్రధాని మోదీ
- కోటి మంది ప్రవాస భారతీయుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్న ప్రధాని
- ఇప్పటికే 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని వెల్లడి
- దేశంలో ఎరువుల కొరత లేదు, ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని స్పష్టీకరణ

హైదరాబాద్ పల్స్,డెస్క్


పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా భారత్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ యుద్ధం గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై,

### ఇరాన్‌తో యుద్ధాన్ని

## తాత్కాలికంగా ఆపేస్తున్నాం

**డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన**

- 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- రెండు రోజులుగా ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి
- ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన



2

### తల్లిదండ్రులను సరిగ్గా

## చూసుకోకుంటే వేతనాల్లో కోత

- విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు ఆమోదం



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ మంత్రివర్గం కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేషపూరిత నేరాల నిరోధక బిల్లును (హేట్ స్పీచ్)

## దమ్ముంటే సమాధానం చెప్పాలి

**విజయమ్మ లేఖ నిజం : వైఎస్ షర్మిల**

- కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన వైఎస్ షర్మిల
- వివేకా హత్య కేసును పక్కదారి పట్టించేందుకే ఈ గొడవ అని ఆరోపణ
- దమ్ముంటే జగనే నేరుగా మాట్లాడాలంటూ సవాల్
- విజయమ్మ లేఖలోని సంతకం నిజమని.. వైసీపీ ప్రచారం అబద్ధమని వెల్లడి
- వైసీపీ నేతలపై అత్యంత కఠిన పదజాలంతో విరుచుకుపడ్డ షర్మిల




2

హైదరాబాద్ పల్స్,అమరావతి

తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

- సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని పెంచాలని ఆదేశం
- ప్రతి ఇంటికీ పైప్డ్ గ్యాస్ కనెక్షన్ ఇచ్చేలా కార్యాచరణకు సూచన
- అకాల వర్షాల పంట నష్టంపై మార్చి 26 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం
- ప్రజా సేవల్లో ఏఐ వినియోగానికి తిరుమల విజయమే నిదర్శనమన్న సీఎం

హైదరాబాద్ పల్స్,అమరావతి

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను



2

### ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే

# రైతుభరోసా

మొదటి పేజీ తరువాయి

ఏవైనా ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన శాసనసభలో మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని అన్నారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని విమర్శించారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఒక్క సీజన్‌కే ఇస్తున్నారని ఆరోపించారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.గత రెండు బడ్జెట్‌లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారని గుర్తు చేశారు. కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పి గత బడ్జెట్‌లో చెప్పి ఈసారి ఆ ప్రస్తావన కూడా తేలేదని విమర్శించారు.

## రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ సందడి ఖాయం. తాజాగా తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించిన మల్లన్న, తన మనసులోని అసలు కోరికను బయటపెట్టారు. రాజకీయంలో సీఎం ఎలాగూ కాలేను, కనీసం వెండితెరపై అయినా ముఖ్యమంత్రి పాత్ర పోషించాలని తనకు బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సినిమాల్లో సీఎం రోల్ వస్తే చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అలా అయినా తన కోరికను తీర్చుకుంటానని నవ్వుతూ చెప్పారు."రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ రెడ్డి తప్ప మరో పవర్‌ఫుల్ లీడర్ లేరని గతంలోనే చెప్పాను. ఒక రకంగా ఆయన్ను సీఎం చేసింది నేనే" అంటూ తనదైన శైలిలో చమత్కరించారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తాను రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని ఆయన స్పష్టం చేశారు.సినిమాలపై తనకున్న మక్కువను వివరిస్తూ.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో తనకు విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందని మల్లారెడ్డి వెల్లడించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్వయంగా అడిగినప్పటికీ, విలన్ వేషం వేయడం ఇష్టం లేక తాను సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. విలన్ కంటే తనకు సీఎం లాంటి పవర్‌ఫుల్ పాత్రల పైనే ఆసక్తి ఉందని ఆయన హింట్ ఇచ్చారు.

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు."గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు

## తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకుంటే వేతనాల్లో కోత

మొదటి పేజీ తరువాయి

మంత్రివర్గం ఆమోదించింది. మతసామరస్యానికి భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు.దీనితో పాటు సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లలు మద్దతుగా ఉండాలనే లక్ష్యంతో పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. తల్లిదండ్రులను సరిగ్గా ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని నిర్ణయించారు. వారి వేతనం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు నేరుగా తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకురానున్నారు.ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వపరంగా జరగాల్సిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం తీసుకువచ్చే బిల్లులకు ఆమోదం తెలిపింది.విశ్వవిద్యాలయాల్లో వివక్షను అరికట్టేందుకు 'రోహిత్ వేముల' చట్టం విధివిధానాల కోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారు.

## బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతాడు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి పదవి అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తులో బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతాడని జోస్యం చెప్పారు. తమ పార్టీల నుంచి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావులకు చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు.బీజేపీ నాయకులు బీసీ వ్యతిరేకులు అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం డిక్లరేషన్ ప్రకటించి చట్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం అందరికీ సన్నబియ్యం ఇస్తోందని, ఇది చారిత్రాత్మకమని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బియ్యం దోపిడీ జరిగిందని ఆరోపించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఏ బకాయిల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చేయబోతున్నట్లు ప్రకటించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే రూ. 4,571 కోట్లు ఉందని భట్టి విక్రమార్క వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బకాయిలను మానవతా కోణంలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అలాగే ఉద్యోగుల కోసం క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కూడా అందజేశామని గుర్తుచేశారు.

## ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు. నిలిచిపోయిన శ్రీకాకుళం - కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు.

పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక

అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస

టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యే నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తిరుమలలో క్యూలైన్ల నిర్వహణ మెరుగుపడిందని, భక్తుల నిరీక్షణ సమయం తగ్గి దాదాపు 20 శాతం అదనపు దర్శనాలు సాధ్యమయ్యాయని వివరించారు.

అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ప్రసాదం నాణ్యత పెరిగిందని, భక్తులు, శ్రీవారి సేవకుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన శాఖలు కూడా మెరుగైన ప్రజా సేవల కోసం ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు.ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచేలా చూడాలని, ఇందుకు పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచాలని, ప్రభుత్వ శాఖలు డేటాను సమర్థంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## దమ్ముంటే సమాధానం చెప్పాలి

మొదటి పేజీ తరువాయి

**ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం**

వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు.తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు.

**విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి**

తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు.

## ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి

మొదటి పేజీ తరువాయి

దేశ వాణిజ్యంపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంపై విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇప్పటికే సభకు వివరించారని గుర్తుచేశారు. ఈ సంక్షోభానికి త్వరగా పరిష్కారం కనుగొనాలని ప్రపంచ దేశాలన్నీ కోరుకుంటున్నాయని తెలిపారు.

ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్, ఎరువులు వంటివి పెద్ద మొత్తంలో హర్మూజ్ జలసంధి నుంచే వస్తాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. యుద్ధం కారణంగా ఈ మార్గంలో నౌకల రాకపోకలు సవాలుగా మారాయని అన్నారు. "అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా మా ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది" అని ఆయన వివరించారు. దేశం తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని దేశీయ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచుతున్నట్లు చెప్పారు.

వ్యూహాత్మక చర్యలతో పెరిగిన ఇంధన భద్రత

గత 11 ఏళ్లలో ఇంధన భద్రత కోసం తమ ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యలను ప్రధాని మోదీ వివరించారు. గతంలో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ వంటివి దిగుమతి చేసుకోగా, నేడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయికి చేరామని తెలిపారు. సంక్షోభ సమయాల కోసం ముడి చమురు నిల్వలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని 64 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెంచేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి కాకుండా ఆయిల్ కంపెనీల వద్ద ఉండే నిల్వలు అదనమని అన్నారు. చమురు, గ్యాస్ సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా వివిధ దేశాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, గల్ఫ్, ఇతర సముద్ర మార్గాలను నిశితంగా గమనిస్తున్నామని మోదీ పేర్కొన్నారు.

## హైదరాబాద్ ను ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు.నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ సహా తెలంగాణలో పలుచోట్ల పెట్రోల్ బంకులు మూత!

మొదటి పేజీ తరువాయి

ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో మన దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ తదితరాలపై భారీ ప్రభావం పడుతోంది. హైదరాబాద్‌లో ఇంధన కొరత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూతబడ్డాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలోని బంకులు వరుసగా మూతబడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.సోమాజిగూడ, ఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లోని పెట్రోలు బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ పలు పెట్రోల్ బంకులు తాత్కాలికంగా తెరుచుకోవడం లేదు. తెరిచి ఉన్న బంకుల్లో వాహనదారులు బారులు తీరుతున్నారు.యుద్ధానికి ముందు చమురు రంగ కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని, కానీ ఇటీవల ఇవ్వడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. కొత్తగా పెట్రోల్, డీజిల్ స్టాక్ కావాలంటే అడ్వాన్స్ కడితేనే వస్తుందని చెబుతున్నారు. కాగా, ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్ కూడా ట్రంప్ ప్రకటనకు సానుకూలంగా ఉండే అవకాశం ఉంది.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న శ్రీ సాయి కృష్ణ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తరుణంలో అకస్మికంగా తనిఖీ నిర్వహించి, పరీక్షల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో హాల్ ఏర్పాట్లు,విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సీసీ కెమెరాల అమరిక,భద్రతా చర్యలు వంటి అంశాలను సమీక్షించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు పరీక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎటువంటి అక్రమాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా అనుమతి లేని వ్యక్తులు కేంద్రంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించకూడదని స్పష్టంగా చెప్పారు. అలాగే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి



విద్యార్థి తన ప్రతిభను పూర్తి స్థాయిలో ప్రదర్శించుకునేలా అనుకూల వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని చెప్పారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా చోటు చేసుకోకూడదని హెచ్చరించిన కలెక్టర్, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# వ్యవసాయంలో యాంత్రీకరణకు వేగం పెంచాలి : కలెక్టర్ సూచనలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, సంగారెడ్డి ప్రతినిధి:**
వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కీలక సూచనలు చేశారు. యాంత్రీకరణ, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే రైతులకు అధిక లాభాలు అందుతాయని తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన యాంత్రీకరణ లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని, ఇప్పటివరకు సాధించిన పురోగతికి సంబంధించిన వినియోగ ధ్రువపత్రాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరిగేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. రైతులను యాంత్రీకరణ వైపు ప్రోత్సహించడం ద్వారా కూలి ఖర్చులు తగ్గి, వ్యవసాయ పనులు వేగంగా పూర్తవుతాయని, ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా చిన్న ట్రాక్టర్లు,గడ్డి తొలగించే యంత్రాలు, నేల దున్నే యంత్రాలు,చెట్లు కత్తిరించే పరికరాలు,మందులు పిచికారీ చేసే యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 97 యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడమే లక్ష్యమని వివరించారు. ఈ పథకం కింద పంటల విభిన్నీకరణ,పశు పోషణ,ఉద్యానవనం వంటి సమగ్ర వ్యవసాయ విధానాలను అమలు చేయాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఎక్కువ మంది రైతులకు తేనెటీగల పెట్టెలు అందేలా చర్యలు తీసుకోవాలని,ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని గ్రామీణ అభివృద్ధి అధికారులకు సూచించారు. వాణిజ్య స్థాయిలో తేనె ఉత్పత్తి చేసే కేంద్రాలు ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ అభివృద్ధి అదనపు కార్యదర్శి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు,జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్,ఎస్సీ సంస్థ అధికారి రామాచారి తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు 30 రోజుల శిక్షణ... కుట్టు మిషన్లు పంపిణీ

**మహిళలు ఆర్థికంగా ఎదగాలి : 81 ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ శ్రీ ముఖేష్ కుమార్ సింగ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, భద్రాద్రి కొత్తగూడెం:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప సిఆర్పిఎఫ్ ఎఫ్ 81 బెటాలియన్ పుసుగుప్ప క్యాంపు కమాండర్ టి.సిజ్జు ఆధ్వర్యంలో ప్రోగ్రాం ప్రారంభించారు. ఇన్చార్జి ఎం. అంబర్ సింగ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 81 బెటాలియన్ కమాండెంట్ శ్రీ కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల ద్వారా ఇప్పటికే ఆదివాసి గ్రామాల్లో రహదారుల నిర్మాణం, విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందజేయడం జరుగుతుందని, అందులో భాగంగా పూసుకుప్ప గ్రామానికి చెందిన నిరుపేదలైన 34 మంది మహిళలకు లిటిల్ కాస్ ఎన్జీవో ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు 30 రోజులపాటు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లను అందజేయడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆదివాసీల అభివృద్ధి




మా లక్ష్యం అని నిరుపేదలకు ఎప్పుడు సహాయ సహకారాలు అందించడంలో సి.ఆర్పి.ఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ భోజన వసతి కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాక. సావిత్రి , సెక్రటరీ లక్ష్మణ్, మహిళలు గ్రామ పెద్దలు సిఆర్పి సిబ్బంది పాల్గొన్నారు.

# శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, రంగారెడ్డి ప్రతినిధి:
ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (53) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ 10, ఇతర శాఖలకు 43, మొత్తం 53 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,



వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనగా కామ్రేడ్స్ భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్ ల 95వ వర్ధంతి

**సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన అమరుల స్ఫూర్తితో నేటి యువత ఉద్యమించాలి**

**పివైఎల్ రాష్ట్ర పంగ నాగరాజు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు లోని సిపిఐ (ఎంఎల్) ఎన్డీఆర్ కార్యాలయంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన అమరులు కామ్రేడ్స్ భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవుల 95 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు, ఈ సందర్భంగా పివైఎల్ రాష్ట్ర నాయకులు పంగ నాగరాజు మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన అమరుల స్ఫూర్తితో నేటి యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన జాతీయత అని తెలిపారు. ఒక దేశాన్ని మరొక దేశం దోపిడీ చేయడానికి యుద్ధాలు చేస్తూ సామ్రాజ్యవాదాన్ని అమెరికా పెంచి పోషిస్తున్నదని అన్నారు. ఈ యుద్ధాలు ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదని తెలిపారు. ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ చేసే దురాక్రమణ దాడులను వెంటనే ఆపాలను కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు,పి.వై.ఎల్ నాయకులు పి.రవి, బి వెంకటేష్, పి.నాగరాజు,జి రమేష్,టి.శ్రవణ్, పి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనిజ్ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ తాంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** భువనగిరి పట్టణం లోని స్థానిక 13 వ వార్డ్ లో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తాంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ అండర్ గ్రౌండ్ డ్రైనిజ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి కి కృషి చేస్తా అని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్రాల సంతోష శ్రీనివాస్, ఎండీ మజర్ పాషా, నరేష్, సభర్ కార్ వెంకటేష్, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గున్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 20, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండల పరిధిలోని గ్రామాలలో నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్లకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైంది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగవేణి, మండల పంచాయతీ అధికారి ఆవుల కిషన్ల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు.

# జూమాజీ పార్లమెంటు సభ్యులు రంజిత్ రెడ్డి మాతృమూర్తి చంద్రకళమ్మ పార్థివ దేహానికి నివాళులు

**పూలమాలవేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి, మార్చి 23, హైదరాబాద్ పల్స్ న్యూస్:** చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ జి. రంజిత్ రెడ్డి మాతృమూర్తి జి. చంద్రకళమ్మ మృతి చెందిన విషయం తెలియగానే జూబ్లీహిల్స్ లోని వారి నివాసానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు ఉప్పలపాటి శ్రీకాంత్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి గంధం రాములు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తో కలిసి వెళ్లి ఆమె పార్థీవ దేహానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పిఎసి చైర్మన్

ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రకళమ్మ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పీఏసీ చైర్మన్. చంద్రకళమ్మ మృతి చెందడం చాలా బాధకరమైన విషయం అని, ఆమె మరణం తీరని లోటు అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను అని వారికి సద్గతి ప్రాప్తించాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనసారా ఆ భగవంతున్ని ప్రార్థిస్తూన్నాను అని తెలిపారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ.**
**సమస్యల పరిష్కారానికి సంబంధిత ఎస్.హెచ్.ఓ లకు తక్షణ ఆదేశాలు.**
**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, సంగారెడ్డి ప్రతినిధి:** ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అంశాలపై ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా మధ్యవర్తిత్వం లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులుగా నాగిర్తి రాజిరెడ్డి

**ప్రభుత్వ విప్ బీర్ల కు కృతజ్ఞతలు చెప్పిన రాజిరెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి నాగిర్తి రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువంగిరి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులై నియామక పత్రాన్ని అందుకున్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షులుగా నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు చెప్పారు. తన పైన ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించనున్నట్లు కార్యకర్తల కు నిరంతరం అందుబాటులో ఉండనున్నట్లు నాగిర్తి రాజిరెడ్డి చెప్పారు. రాజపేట మండలంలోని అన్ని గ్రామాల, ముఖ్యంగా నరసాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రతినిధులు నాగిర్తి రాజిరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

# నేతల వర్గపోరు సెల్ టవర్ జోరు స్థానికులు బేజారు

**అంగన్వాడి కేంద్రం ప్రక్కనే సెల్ టవర్ ఏర్పాటు**
**కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా అంటున్న సిడిపిఓ కోరాడ రేవతి**
**వర్గపోరుతో ఢీ అంటే ఢీ అంటున్న నేతలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో సెల్ టవర్ నిర్మాణం వద్ద సోమవారం ఉదయం గ్రామస్తుల వర్గపోరుతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అధికార పార్టీ నేతలు ఒంటెద్ది పోకడలతో ఎయిర్టెల్ సెల్ టవర్ సంస్థకు కొమ్ము కాసి స్థానికులను భయాందోళన గురి చేస్తున్నారని వాపోయారు. అంగన్వాడి కేంద్రానికి అతి సమీపంలో ఈ నిర్మాణం చేపట్టడం అభం, శుభం తెలియని చిన్నారుల ఆరోగ్యాన్ని క్షీణింప చేయడమే కాకుండా చుట్టు ప్రక్కల నివసిస్తున్న కుటుంబాలను రేడియేషన్ పేరిట అనారోగ్యాలతో పీడించడమే అని ఆందోళన చెందుతున్నారు. సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని గర్భిణీ స్త్రీలు, అంగనవాడి పిల్లల తల్లిదండ్రులు సిడిపిఓ రేవతికి వినతి పత్రం అందజేయగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రాణాంతకమైన సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని వ్యాఖ్యానించారు. అదేవిధంగా సర్పంచ్ బానోత్ సరోజ మాట్లాడుతూ ఈ సెల్ టవర్ నిర్మాణం జరిగినట్లయితే ప్రతి 100 మందిలో



60 మంది స్థానికులు అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి వస్తుందని ఈ సెల్ టవర్ నిర్మాణం జనావాసంలో కాకుండా కొంత దూరంలో నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నారు. సెల్ టవర్ నిర్మాణానికి కొమ్ముకాస్తున్న అధికార పార్టీ నేతలపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# గోపనపల్లిలో అక్రమ నీటి తరలింపుతో తీవ్ర తాగునీటి సంక్షోభం, ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు



**శేరిలింగంపల్లి, మార్చి 23, హైదరాబాద్ పల్స్ న్యూస్:** శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని వాణిజ్య అవసరాల కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావంతో భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం గోపనపల్లి గ్రామస్థులు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, సురేందర్, శివకుమార్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన ప్రజా వ్యతిరేక పాలన : బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదగిరిగుట్ట బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ విలేకర్ల తో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వం అవినీతి అరాచక కమీషన్ల పాలనతో తెలంగాణ ను భ్రష్టు పట్టిస్తూ ప్రజల బతుకులను ఆగం చేస్తూ భావితరాలకు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ నిలదీస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తలపెట్టిన సందర్భంగా సోమవారం పోలీసులు నన్ను మరియు ఇతర నాయకులను అక్రమంగా ఇంటి దగ్గర అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఇలాంటి అక్రమ అరెస్టులకి భయపడేది లేదని ప్రజలలో బిజెపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి అరెస్టులు కాంగ్రెస్ ప్రభుత్వం చేయించడం కాంగ్రెస్ దుర్మార్గ పాలన. రాబోయే ఎలక్షన్ లో ప్రజలు కాంగ్రెస్ పాలన అంతం చేయడం తద్యం అని రచ్చ శ్రీనివాస్ అన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలని ఆపలేరని ప్రజల సమస్యల కోసం పోరాటం చేయడంలో బిజెపి ఎప్పుడు ముందుంటది. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలి సోయి తప్పి పేదల ఉసురు పోసుకుంటున్న రేవంత్ సర్కారుకు సురుకులు పెడదాం అని రచ్చ శ్రీనివాస్ అన్నారు. అరెస్టయిన వారిలో పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యుడు గుంటుపల్లి సత్యనారాయన తదితరులు ఉన్నారు.




# ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**రూ 5.41 కోట్లతో...సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం**
**మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యత ఇస్తుండగా, నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలలో రూ 5 కోట్ల 41 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం మజీద్ పల్లిలో స్థానిక సర్పంచ్ చెన్నయ్యతో కలిసి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతులు అభ్యున్నతిని కాంక్షిస్తూ రూ 2 లక్షల పంట రుణమాఫీతో పాటు సన్న ధాన్యానికి రూ 500 బోనస్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే రూ 9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయగా, అర్హులైన



ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, ఉప సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి ప్రజలకు తీపికబురు.. కుప్పకూలిన బంగారం, వెండి ధరలు!

**బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా పతనం**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, మెయిన్ డెస్క్: కొనబోతే కొరివి అన్నట్లుగా ఇన్నాళ్లు పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు గత వారం రోజులుగా దిగి వస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ మరోసారి పసిడి, వెండి ధరలు ఊహించని విధంగా పతనమయ్యాయి. ఒకేరోజు వేలల్లో ధరలు తగ్గడంతో కొనుగోలుదారులకు, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు పెద్ద ఊరటనిస్తోంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర నేడు ఏకంగా రూ.5,950 తగ్గి ప్రస్తుతం రూ.1,40,020 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా




ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.5,450 పతనమై, రూ.1,28,350కు చేరింది.మరోవైపు కేజీ వెండిపై ఏకంగా రూ.20 వేలు తగ్గి, ప్రస్తుతం రూ.2,30,000 పలుకుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాల కారణంగానే దేశీయ మార్కెట్‌లో ఈ స్థాయిలో ధరలు తగ్గినట్లుగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తాజా పరిణామంతో నగల దుకాణాలు కస్టమర్లతో కిటకిటలాడే అవకాశం ఉంది.

# సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన విప్లవకారులు భగత్ సింగ్, రాజ్ గురు, సుక్ దేవ్

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసుల నరేష్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నాడు సామ్రాజ్యవాదం పెరుగుతున్న తరుణంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అతి చిన్న వయసులో ప్రాణాలు అర్పించిన గొప్ప విప్లవ వీరులని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసుల నరేష్ అన్నారు. సోమవారం భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర హాస్టల్లో డ్రగ్స్, గంజాయి వద్దు మన ఆరోగ్యం ముద్దు అనే అంశంపై సెమినార్ నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధానికి కారణం అమెరికన్ సామ్రాజ్యవాదం అని నాడు స్వాతంత్ర ఉద్యమం నుండి సామ్రాజ్యవాదం మరింత పెరుగుతూ వచ్చిందని దానికి వ్యతిరేకంగా పోరాడి అనేక మంది అమరవీరులు బలి అయ్యారని వారి ఆశయ సాధన కోసం విద్యార్థి యువత పోరాటాలు ఉధృతం చేయాలని ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మహనీయుల జీవిత చరిత్రలను వక్రీకరించి తప్పుడు చరిత్రలను పాఠాలుగా చేర్చి విద్యార్థులకు నేర్పుతున్నారని లౌకిక దేశంగా ఉన్న భారతదేశాన్ని కులం పేరుతో మతం పేరుతో విడదీసి మనుషుల మధ్య చీలికలు తీసుకురావాలని కుట్ర జరుగుతుందని దీనిని విద్యార్థి లోకం యువత ఎదిరించడానికి పోరాటాల్లోకి రావాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 - 27 వార్షిక బడ్జెట్ పూర్తిగా యువతకు విద్యార్థి లోకానికి ఆమడ దూరంలో ఉందని రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నీరుగారిచే విధంగా బడ్జెట్ కేటాయించారని వారన్నారు. వీరితోపాటు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విప్లవ్ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు కంతి రాజకుమార్, కంతి విక్రమ్ సాయిని కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ పట్టణంలో బసవేశ్వర చౌక్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షులు రాజు అధ్యక్షతన భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించడం జరిగింది. ఈ వర్ధంతికి సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ హాజరై మాట్లాడుతూ స్వతంత్ర పోరాట యోధుడు యువ కెరటం బ్రిటిష్ గుండెల్లో రైలు పరిగెత్తించిన యోధుడు భగత్ సింగ్ అని కొనియాడారు నారాయణఖేడ్ నియోజకవర్గంలో గ్రామాలకు రోడ్లు సదుపాయాలు లేక ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మాణిక్యం, నర్సింలు, ప్రతాప్, ప్రశాంత్, ఇస్మాయిల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో సమానత్వాన్ని పెంచేది విద్య: ఎమ్మెల్యే జిఎంఆర్

## విద్యా భారతి పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి 20 లక్షల రూపాయల భారీ విరాళం



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23 :** విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనమని.. సమాజ అభివృద్ధికి.. వ్యక్తిగత ఎదుగుదలలో విద్య కీలకపాత్ర పోషిస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో గల విద్యా భారతి పాఠశాలలో 20 లక్షల రూపాయల సొంత నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను సోమవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు జాతీయ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ..శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధిని పెంపొందించడంలో విద్యా భారతి సంస్థల కృషి అభినందనీయమన్నారు.ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలంటే.. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలాషించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా విధానంలోనూ సంస్కరణలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్ ను సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యా భారతి సంస్థ దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, భారతీ విద్యా సమితి అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి రవి, టప్ప కుమార్, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# అఖండ హరే రామ నామ సంకీర్తన లో పాల్గొన్న శ్రీ భవానీ శంకర స్వామి భక్త బృందం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యతివర భావనంద భారతి స్వామి వారి కరకమలములచే ప్రతిష్టించబడిన, వాసాలమర్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవంలో భాగంగా తొమ్మిది రోజులు అనగా ఉగాది నుండి శ్రీరామనవమి వరకు, అఖండ హరే రామ నామ సంకీర్తన (రాత్రి పగలు ఆపకుండా) జరుగుతుంది. ఇందులో ఉత్సాహవంతులైన భక్తులు, స్వామివారి సేవలో సోమవారం రోజు రాజపేట మండలం రేణికుంట గ్రామంలోనీ శ్రీ భవానీ శంకర స్వామి భక్త బృందం పాల్గొన్నది. ఈ సందర్భంగా శ్రీ భవానీ శంకర స్వామి భక్త బృందం వారు మాట్లాడుతూ స్వామి వారి భజన కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

# సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**ఎస్-న్యాబ్, సిసిఎస్, సదాశివపేట పోలీసుల సంయుక్త ఆపరేషన్లో సుమారు 2.87-కోట్ల విలువ గల 574 కిలోల నిషేధిత ఎండు గంజాయి స్వాధీనం**

**3- అంతర్రాష్ట్ర అక్రమ రవాణాదారులు అరెస్ట్. 1-కియా సోనేట్ కారు, డిసియం, 287-గంజాయి ప్యాకెట్లు సీజ్**

**కేసు చేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, సంగారెడ్డి ప్రతినిధి:** సోమవారం నాడు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. ఆదేశానుసారం పటాన్ చెర్వు డిఎస్పీ ప్రభాకర్, సంగారెడ్డి జిల్లా ఎస్-న్యాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సదాశివపేట ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్ సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు సదాశివపేట బైపాస్ రోడ్డు లో సంగారెడ్డి వైపు నుండి వస్తున్న కియా సోనేట్ కారు ఎంహెచ్ 31ఈసి 0998, డిసియం ఎంహెచ్ 45 ఏపీ 4313, గల వాటిని తనిఖీ నిర్వహించగా డిసియంలో 287-ప్యాకెట్ల ఎండు గంజాయిని గుర్తించడం జరిగింది. దాని విలువ సుమారు 2.87 కోట్ల రూపాయలు ఉంటుంది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని, క్రైమ్ నెంబర్ 151/2026 సదాశివపేట పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసి, నిందితులను గౌరవ న్యాయస్థానం ముందు ప్రవేశ పెట్టడం జరుగుతుంది అన్నారు.

**నిందితుల వివరాలు:**

**అరెస్టు చేసిన నిందితులు:లి 1-పింకు, 2-పప్పు దలాయి, 3-నారాయణ ప్రసాద్ బెహ్రా.**



జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసులు ఉక్కు పాదం మోపడం జరుగుతుందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా ఎస్-ఎన్.ఏ.బి నెంబర్ 8712656777 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఇట్టి కేసు చేదనలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి జిల్లా ఎస్-న్యాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావ్, సిబ్బంది, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సదాశివపేట ఇన్స్పెక్టర్ వెంకటేశం, క్లూస్ టీం సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

**14వ వేతన ఒప్పందం చర్చలు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ తో చేయాలంటూ కార్మికుల నిరసన**

**13వ ఒప్పంద పెండింగ్ అంశాలపై యాజమాన్యం నిర్లక్ష్యం అంటూ ఆగ్రహం**

**ట్రేడ్ యూనియన్‌లు, అన్ని పార్టీల మద్దతుతో ఆందోళన ఉధృతి**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** ఐటీసీ పీఎస్పీడీ సారపాకలో కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు యాజమాన్యానికి గట్టి హెచ్చరికగా మారాయి. 14వ వేతన ఒప్పందం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జె.ఎ.సి తో చర్చలు చేయాలని, 13వ వేతన ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించాలని కార్మికులు స్పష్టంగా డిమాండ్ చేస్తున్నారు.యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడంతో ఇకపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు.ఈ దీక్షలకు విశాల మద్దతు లభిస్తోంది. బీఆర్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ వంటి ట్రేడ్ యూనియన్‌ల జిల్లా, మండల నాయకులు దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు.

# శంకరాచార్యులు అందరివాడు..!

## జాతీయ బీజేపీ నేత మురళీధర్ రావు

## అద్దాల మండపం నిర్మాణం అభినందనీయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 23, జహీరాబాద్ :** జగద్గురు ఆదిశంకరాచార్యులు ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని, ఆయన సిద్ధాంతాలు భారతదేశం అంతటా విస్తరించి ఉన్నాయని, ఆయన ప్రజలందరివాడని జాతీయ బీజేపీ నేత మురళీధర్ రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో నూతనంగా నిర్మిస్తున్న ఆదిశంకరాచార్యుల అద్దాల మండపం అభినందనీయంగా ఉందని ట్రస్ట్ సభ్యులను ఆయన అభినందించారు. సోమవారం ఆయన బీజేపీ నేతలతో కలిసి దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, ట్రస్ట్ సభ్యులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం జ్యోతిర్లింగాల వద్ద రుద్రాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి సిద్ధేశ్వరానందగిరితో కలిసి నూతనంగా నిర్మిస్తున్న శంకరాచార్యుల అద్దాల మండపాన్ని పరిశీలించారు. ఆశ్రమంలో మొదటి విగ్రహం ప్రతిష్ఠించడంతో పాటు, తెలుగు రాష్ట్రాలలో మరో 107 విగ్రహాలను ప్రతిష్ఠ చేయాలనుకోవడం అభినందనీయమని ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గొల్ల భాస్కర్, విశ్వ మానవ ధర్మ ప్రచారం సభ్యులు రాజు పాటిల్,రమేష్ పాటిల్, బి కృష్ణ, గొల్ల నరసింహులు, నాగన్న పాటిల్, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు

# భగత్ సింగ్ - రాజగురు - సుఖదేవ్ లకు విప్లవ జోహార్లు

## ఎండి జహంగీర్. సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** దేశ స్వాతంత్రం కోసం ఉరి ఖంభం మెక్కిన వీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల చిత్ర పటాలకు సీపీఎం జిల్లా కార్యాలయంలో పూలమాల వేసి ఘనంగా నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రెటరీ ఎండి జహంగీర్ మాట్లాడుతూ... 23 సంవత్సరాల వయసులో భగత్ సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి ఉరి ఖంభం ఎక్కారని వీరుల మరణం వృధా కారాదని అన్నారు. నాడు దేశ విముక్తి కోసం కుల మతాలకు అతీతంగా పోరాడరని అందుకే విజయాలు సాధించారని అన్నారు. నాటి స్ఫూర్తి తో నేటి పాలకుల మతోన్మాద విధానాలను ఐక్యంగా ఓడించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు బోలగాని జయరాములు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, దయ్యాల నర్సింహా, వనం ఉపేందర్, పల్లెర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ ప్రభుత్వ విప్ లు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర రైతుల పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వ విప్ లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయం "రైతు భరోసా" నిధులను విడుదల చేశారు. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులను విడుదల చేశారు. రైతుల ఖాతాల్లో నిధులు జమకావడం తో రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. 45 రోజుల్లోగా 9 వేల కోట్ల రూపాయలు రైతులందరి ఖాతాల్లో నిధులు చేరిపోతాయని ప్రకటించడం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బాలు నాయక్, చింతకుంట విజయ రామనారావు, యాన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ లు తదితరులు ఉన్నారు.

# గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక రక్షణ కల్పించాలి - ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** సాంకేతిక విప్లవం నేపథ్యంలో ఉద్భవించిన గిగ్ ఎకానమీ లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సంక్షేమం పై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అసెంబ్లీ లో ప్రస్తావించారు. ఉబార్, ఓలా, స్విగ్గి, జోమోటో వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సేవలు అందిస్తున్న యువత నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల అవసరాలను తీర్చడంలో గిగ్ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి సరైన ఉద్యోగ భద్రత లేదు.ప్రమాదాలు జరిగినప్పుడు ఆదుకునే నాథుడు లేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఆరోగ్య భీమా, పెన్షన్ మరియు ప్రమాద భీమా వంటి కనీస సామాజిక భద్రతా సౌకర్యాలు వీరికి అందడం లేదు. గిగ్ వర్కర్లను కేవలం'భాగస్వాములు' గానే చూడకుండా, వారిని కార్మికులుగా గుర్తించి ప్రత్యేక విధానాలను రూపొందించాలి. వారికి వర్తించేలా ప్రమాద భీమా మరియు ఆరోగ్య భీమా పథకాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి.సమాజంలో అంతర్భాగంగా ఉన్న ఈ అసంఘటిత రంగ కార్మికుల కష్టాన్ని గుర్తించి, ప్రభుత్వం వారి ఉజ్వల భవిష్యత్తు కోసం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను అని అన్నారు

# ప్రభుత్వ పాఠశాలలలో మూత్రశాలలు నిర్మాణం నెలాఖరులోగా పూర్తి చేయాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :**
ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరైన మూత్రశాలల నిర్మాణాలు ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తో కలిసి గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎ. పి. ఓ.లు, సాంకేతిక సహాయకులు, సెర్ప్ ఎ. పి. ఎం.లతో ఉపాధి హామీ పథకం, స్త్రీ నిధి రుణాలు, బ్యాంకు రుణాల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1084 ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూత్రశాలల నిర్మాణ పనులు ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని, ఆ దిశగా ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మస్టర్ జనరేట్ చేసి బిల్లులు రూపొందించాలని, ఇంకా పనులు ప్రారంభం కాని చోట వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండల సమాఖ్య భవనాలు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలపై అధికారులు పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలు చేపట్టే విధంగా గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు శాతం పెంపొందించేలా అధికారులు కృషి చేయాలని, పని ప్రదేశాలలో త్రాగునీరు, నీడ, ఓ. ఆర్. ఎస్. సౌకర్యాలు ఉండేలా చూడాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల అభివృద్ధి దిశగా స్త్రీ నిధి రుణాలు అందజేయాలని, మంజూరు చేసిన రుణాల రికవరీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. తీసుకున్న రుణాలు చెల్లించి తిరిగి అధిక రుణం పొందేలా స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితిక పంత్

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించిన ఎస్పి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత డిఎస్పీ/ఎఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ లతో ఫోన్ లో ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని, బాధితులు, సమస్యలు ఉన్నవారు ప్రజావాణి కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలి అని తెలియజేశారు.



# చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి

## గిరిజనులను చులకన చూస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
## ఎల్.హెచ్.పి.ఎస్ నియోజకవర్గ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, షాద్నగర్ :**
రాష్ట్రంలో లంబాడి సమాజ హక్కుల సాధన కోసం ఉద్యమం మరింత ఉధృతం కానుంది. ఈ నెల 25వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి షాద్నగర్ నియోజకవర్గం అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్ తెలిపారు. లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమం పేరుతో హామీలు ఇస్తున్న ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఘాటుగా విమర్శించారు. ముఖ్యంగా చేవెళ్ల డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ ఈ అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. అదేవిధంగా తండాలను గిరిజన రెవెన్యూ



గ్రామపంచాయతీలుగా గుర్తించకపోవడం గిరిజనుల అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారిందని విమర్శించారు. లంబాడి సమాజానికి రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని కనీసం క్యాబినెట్‌లో ఒక మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం అన్యాయమని లక్ష్మణ్ నాయక్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోయి, గిరిజనుల సమస్యలను పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. అదేవిధంగా, ఈనెల 25న నిర్వహించనున్న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి గిరిజన ఉద్యోగులు, యువతతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా పార్టీలు, రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక వర్గం పోరాటం కాకుండా గిరిజనుల ఆత్మగౌరవం హక్కుల సాధన కోసం జరుగుతున్న సమగ్ర ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లంబాడి సమాజం మొత్తం ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## క్యూనెట్ కుంభకోణం గుట్టురట్టు..

# మూడు రాష్ట్రాల్లో సోదాలు, 32 మంది అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, రంగరెడ్డి బ్యూరో:** దేశవ్యాప్తంగా మల్టీలెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) పేరిట కోట్లాది రూపాయల మోసాలకు పాల్పడుతున్న 'క్యూనెట్' సంస్థ ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టారు. పక్కా సమాచారంతో మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి 11 మంది మహిళలు సహా 32 మంది కీలక నిందితులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వెల్లడించారు. సోమవారం బషీర్‌బాగ్ సీసీఎస్‌లో ఆయన ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాతో పంచుకున్నారు. సిద్దిపేటకు చెందిన హరికృష్ణ అనే వ్యక్తి క్యూనెట్ వలలో పడి రూ.5 లక్షలు పోగొట్టుకుని, సంస్థ మోసాలను వివరిస్తూ సూసైడ్ నోట్ రాసి అక్టోబర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సజ్జనార్ తెలిపారు. క్యూనెట్‌పై తెలంగాణ వ్యాప్తంగా 68, హైదరాబాద్‌లో 22 కేసులు (ఇటీవల మరో 4) నమోదయ్యాయి. ఎస్బీ జాయింట్ సీపీ ఆధ్వర్యంలో 30 ప్రత్యేక బృందాలతో మూడు రాష్ట్రాల్లోని 27 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

**మోసాల తీరు ఇలా.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్**

సీపీ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం.. సెకండ్ ఇన్‌కమ్ (అదనపు ఆదాయం) ఆశచూపి స్టార్ హోటళ్లలో మీటింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. విలాసవంతమైన కార్లు, ఇళ్లు చూపిస్తూ ఐటీ ఉద్యోగులను ప్రధానంగా బురిడీ కొట్టిస్తున్నారు. డబ్బుల్లేని వారికి ప్రైవేట్ ఫైనాన్స్, ఫిన్‌టెక్ యాప్‌ల ద్వారా లోన్లు ఇప్పించి మరీ పెట్టుబడులు పెట్టిస్తున్నారు. 1998 నుంచి ఈ నిర్వాహకులు వివిధ పేర్లతో చీటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సంస్థ పేరు చెప్పకుండా బాండ్ పేపర్లు రాయించుకుని వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్లు, తేనె వంటి వస్తువుల అమ్మకాల నెపంతో మోసాలకు పాల్పడుతున్నారు.

**ఈడీకి సమాచారం.. ప్రజలకు సీపీ హెచ్చరిక**

ఈ భారీ కుంభకోణంలో మనీ లాండరింగ్ కోణం కూడా ఉన్నందున, తదుపరి విచారణ నిమిత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్




డైరెక్టరేట్ (ఈడీ)కి సమాచారం అందజేస్తామని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చంటూ వచ్చే మోసపూరిత ఆఫర్ల పట్ల అమాయక ప్రజలు, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్ నిర్ణయం.. ఇజ్రాయెల్ ఏమన్నదంటే?



ఇరాన్‌తో యుద్ధాన్ని ఐదు రోజుల పాటు విరమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించింది. యుద్ధ విరమణ అమెరికాకే పరిమితమని స్పష్టం చేసింది. తాము యుద్ధాన్ని విరమించలేదని పేర్కొంది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రారంభమైంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల కారణంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో దాదాపు అన్ని దేశాల్లో ఇంధన సంక్షోభం తలెత్తింది.ట్రంప్ యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించినట్లు ప్రకటిస్తే, ఇజ్రాయెల్ మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించడం గమనార్హం. ఇరాన్‌తో రెండురోజుల పాటు చర్చలు జరిగాయని, ఈ చర్చలు సానుకూలంగా సాగాయని, ఈ నేపథ్యంలో యుద్ధానికి ఐదు రోజుల పాటు విరామం ఇస్తున్నానని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో తదుపరి చర్చల ఫలితాల ఆధారంగా నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

# ఉగాది పురస్కారం అందుకున్న గాయని పబ్బోజు శోభారాణి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన గాయని పబ్బోజు శోభారాణి ఉగాది పురస్కారం అందుకున్నారు.త్రివేణి సంగమం కల్చరల్ అకాడమీ అధినేత డాక్టర్ రాజారామన్ చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సినీ రాజకీయ వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు

# ఆరుట్ల మృతి పట్ల సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నివాళులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** స్వతంత్ర సమరయోధులు ఆరుట్ల లక్ష్మి నరసింహా రెడ్డి మనవడు ఆరుట్ల వెంకట లక్ష్మి నరసింహా రెడ్డి అంత్యక్రియలు సోమవారం జనగాం జిల్లా పెంబర్తిలో వ్యవసాయ క్షేత్రశీలో జరుగగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం హాజరయ్యారు

## ఆరోగ్య రంగంలో మరో ముందడుగు...

# సంగారెడ్డి జిల్లాలో డిజిటల్ ప్రొఫైల్ ప్రారంభం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాను డిజిటల్ ఆరోగ్య ప్రొఫైల్ అమలుకు ప్రయోగాత్మక జిల్లాగా ఎంపిక చేయడంతో ఆరోగ్య రంగంలో మరో ముఖ్యమైన ముందడుగు పడింది. సోమవారం నుండి సంగారెడ్డి విభాగ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ప్రాంతీయ ఆసుపత్రులు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మరియు ఒక సముదాయ ఆరోగ్య కేంద్రంలో రోగుల ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి రోగి ఆరోగ్య చరిత్రను సేకరించి, ఒకే వేదికపై భద్రపరచే చర్యలు చేపడుతున్నారు. దీంతో రోగులు ఎక్కడ చికిత్స పొందినా వారి వైద్య సమాచారం సులభంగా అందుబాటులో ఉండి, వైద్య సేవలు వేగంగా మరియు సమర్థవంతంగా అందించేందుకు వీలవుతుంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆరోగ్య వివరాల నమోదు విధానాన్ని పరిశీలించారు. రోగుల వివరాల సేకరణ, నమోదు ప్రక్రియ, వినియోగంలో ఉన్న వ్యవస్థ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. రోగుల సమాచారం ఖచ్చితంగా నమోదు కావాలని, ఎటువంటి లోపాలు లేకుండా పనిని నిర్వహించాలని సూచించారు. అలాగే సంబంధిత అధికారులకు నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు పురోగతిని సమీక్షిస్తూ, కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. డిజిటల్ ఆరోగ్య ప్రొఫైల్ అమలు ద్వారా రోగుల వైద్య చరిత్ర, పరీక్షల వివరాలు, చికిత్స సమాచారం అన్నీ



ఒకేచోట అందుబాటులో ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావు, వైద్యులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# చిట్కుల్‌లో మిన్నంటిన ఆధ్యాత్మిక వేడుకలు

**నీలం మధు ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ సీతా రామచంద్రుని ఊరేగింపు**

**కేరళ మేళం, కథాకళి, శివ నృత్యాలు, ఆంజనేయుడి వేషధారణతో ఆకట్టుకున్న ఊరేగింపు ఉత్సవాలు**

**మహిళలతో కలిసి ఆ శ్రీరాముని గీతాలకు కోలాటం ఆడిన నీలం దంపతులు**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23 :** మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు మూడవ రోజైన సోమవారం అత్యంత వైభవంగా కోనసాగాయి.సోమవారం ఉదయం నుండే ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గోపూజ, మూలమంత్ర అనుష్ఠానములు, పురుష సూక్త హవనములు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీలం మధు దంపతులు స్వయంగా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, లోక కల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం సాయంత్రం జి టి న్ కాలనీ నుండి ఐలమ్మ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగిన విగ్రహాల ఊరేగింపు కనువిందు చేసే సాంస్కృతిక ప్రదర్శనలతో చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జై శ్రీ రామ్ నినాదాలతో పుర వీధులు భక్తిభావంతో పులకించిపోయాయి.కేరళ కళాకారుల విన్యాసాలు , శివ తాండవ నృత్యాలు, ఆంజనేయుడి వేషధారణ ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్వామి వారి





విగ్రహాల ఊరేగింపు లో కేరళ నుండి ప్రత్యేకంగా రప్పించిన కళాకారుల చెండ మేళం గ్రామం అంతటా ప్రతిధ్వనించాయి. పురాణ గాథలను కళ్లకు కట్టేలా ప్రదర్శించిన కథాకళి నృత్యం, వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి, శివ తాండవ నృత్యాలు ఊరేగింపుకు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకుని



వచ్చాయి.ఈ సందర్భంగా శ్రీ రామ భక్తి గీతాలకు నీలం మధు దంపతులు మహిళలతో కలిసి కోలాటం ఆడుతూ భక్తి పర్యవశ్యంలో మునిగిపోయారు. ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ గా జరిగిన ఈ ఊరేగింపు వేడుకలను గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ



కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

# భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ లకు విప్లవ జోహార్లు

**వేముల బిక్షం సిపిఎం మండల కార్యదర్శి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** సిపిఎం పార్టీ ఆత్మకూరు మండలం కూరెళ్ళ గ్రామం సిపిఎం పార్టీ ఆఫీసుల గ్రామ శాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95 వర్ధంతి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వేముల బిక్షం మాట్లాడుతూ... అంతరాలు, వివక్షతలు లేని, శ్రమ దోపిడీ లేని సమ సమాజం కావాలని పోరాడి ఉరికొయ్యలకు ఊయల లూగిన విప్లవ వీర కిశోరాలు, నిజమైన దేశభక్తులుభగత్ సింగ్, రాజుగురు , సుఖదేవ్ లు మనకు దూరమైన రోజు వారికి విప్లవ జోహార్లు ! ఏదైనా నమ్మే ముందు దానిని ప్రశ్నించాలని, విచక్షణతో ఆలోచించడం ముఖ్యమని, మతం అనేది మనిషి బలహీనతకు సంకేతం అని, మనుషులను విడదీసే వ్యవస్థను భగత్ సింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. నిజమైన స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలకులు వెళ్ళిపోవడం కాదు, సామాన్యుడు, కార్మికుడు, రైతు ప్రతి ఒక్కరూ దోపిడీకి గురికాకుండా జీవించగలగడం అని నమ్మిన భగత్ సింగ్ వారి ఆశయాల కొనసాగింపులో పనిచేద్దాం ప్రజలను దోపిడీ చేస్తున్న పాలకుల విధానాలపై పోరాడుదాం జోహార్ భగత్ సింగ్, రాజుగురు, సుఖిదేవ్ జోహార్ లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, ఉపసర్పంచ్ హనుమంతుల రమేష్, గడ్డం రవి, వడ్లకొండ బిక్షపతి, రమేష్ పొన్నం, అండాలు, మంగమ్మ, మల్లమ్మ, అండాలు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# రాజపేట పీఎం శ్రీ పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ

**ఎస్ఎస్సి పరీక్ష కేంద్రాలను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన డీఈవో కందుల సత్యనారాయణ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట, రఘునాథపురం లోని ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఎస్ఎస్సి పరీక్ష రాసిన విద్యార్థులతో మాట్లాడారు. రాజపేట లోని పీఎం శ్రీ పాఠశాల లోని ఎనిమిదవ తరగతి గదిలో ఆంగ్ల బోధన చేస్తున్న సమయంలో డీఈవో పిల్లలతో మాట్లాడారు. కొద్దిసేపు ఉపాధ్యాయునిగా వ్యవహరించి బోధన చేశారు. బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా



భోంచేసిన డీఈవో పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈఓ చందా రమేష్, పాఠశాల



ప్రధానోపాధ్యాయులు తడ్కరాజు, తదితరులున్నారు

## నో హెల్మెట్ - నో డ్రైవ్.... యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ ఎలగొండ కృష్ణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 23, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా యాదగిరిగుట్ట ట్రాఫిక్ పిఎస్ పరిధిలో వంగపల్లి, పెద్ద కందుకూరు, ఆలేరు, మోటకొండూరు పరిధిలో హెల్మెట్ లేకుండా ఎన్.హెచ్163 హైవే ఎక్కే వాహనాలకు స్పెషల్ కౌన్సిలింగ్ చేయించి, అవసరమైన వాళ్లకి హెల్మెట్ కొనిపించి, హెల్మెట్ ధరించని వాళ్లకు ఫైన్లు విధించడం జరిగింది. వరంగల్ హైవే మీద టూ వీలర్స్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ లను ధరించాలని లేనియెడల ఇకమీదట కచ్చితంగా ఫైన్లు విధించడం జరుగుతుందని స్థానిక యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ ఎలగొండ కృష్ణ తెలిపినారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల తలకు గాయాల తీవ్రత తగ్గుతుందని హాస్పటల్లో అయ్యే బిల్లు కూడా తగ్గుతుందని తెలిపారు. సోమవారం ఈరోజు యాదగిరిగుట్ట ట్రాఫిక్ పిఎస్ పరిధిలో 36 హెల్మెట్లు కొనిపించడం, అదేవిధంగా హెల్మెట్ ధరించని వాహనదారులకు 44 ఫైన్స్ విధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, ఆర్ఎస్ఐ రాజు, కానిస్టేబుళ్లు కోటి సురేష్ నితిన్ సైదులు మిగతా సిబ్బంది పాల్గొనడం జరిగి

## గ్యాస్ కొరత.. 10 కేజీల ఎల్పీజీ సిలిండర్ల వార్తలపై స్పందించిన కేంద్రం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23, ఢిల్లీ డెస్క్:** గత కొద్ది గంటలుగా సోషల్ మీడియా, కొన్ని జాతీయ మీడియా సంస్థల్లో చక్కర్లు కొడుతున్న ఎల్పీజీ సిలిండర్ల బరువు తగ్గింపు (ఎల్పీజీ సంక్షోభం) వార్తలకు కేంద్ర ప్రభుత్వం ముగింపు పలికింది. గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్ పరిమాణాన్ని 14.2 కిలోల నుంచి 10 కిలోలకు కుదిస్తున్నారనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ అధికారికంగా వివరణ ఇచ్చారు. సిలిండర్ బరువు తగ్గింపుపై వస్తున్న కథనాలన్నీ కేవలం అంచనాలు, ఊహాగానాలేనని ఆమె తేల్చి చెప్పారు. పాత సిలిండర్లలోనే తక్కువ గ్యాస్ నింపి సరఫరా చేస్తారనే వార్తలను నమ్మవద్దని సూచించారు.పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఇతర రాజకీయ ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా వంటగ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడవచ్చని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో, దేశీయంగా గ్యాస్ కొరత రాకుండా చూసేందుకు చమురు సంస్థలు ఒక వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నాయని, అందులో భాగంగానే సిలిండర్ బరువును 10 కిలోలకు తగ్గించాలని భావిస్తున్నట్లు ప్రచారం జరిగింది.

**వినియోగదారులపై ప్రభావం ఉండదు:**

సాధారణంగా ఒక కుటుంబానికి 14.2 కేజీల సిలిండర్ సుమారు 40 రోజుల వరకు వస్తుంది. ఒకవేళ అది 10 కేజీలకు తగ్గితే నెల రోజుల్లోపే అయిపోయే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. అయితే, ఈ మార్పుల వల్ల అందరికీ గ్యాస్ అందేలా చూడవచ్చని కొన్ని కథనాలు పేర్కొన్నాయి. తాజాగా కేంద్రం ఇచ్చిన క్లారిటీతో ఈ గందరగోళానికి తెరపడింది. ప్రస్తుతానికి పాత పద్ధతిలోనే 14.2 కిలోల సిలిండర్ల పంపిణీ కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.



## పాక్ కు కీలక సమాచారం చేరవేస్తున్న వాయుసేన ఉద్యోగి అరెస్టు!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 23 :**

పాకిస్థాన్‌కు సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలపై భారత వాయుసేన ఉద్యోగిని రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు. తన స్వార్థ ప్రయోజనాల కోసమే దేశ భద్రతను తాకట్టు పెట్టాడు ఈ ప్రబుద్ధుడు. పాక్‌కు చెందిన వారితో పరిచయాలుండడమే కాకుండా గూఢచర్యం చేస్తున్నట్లు దర్యాప్తులో నిర్ధారించారు. వేరే కేసు దర్యాప్తులో భాగంగా ఈ గూఢచర్యం విషయం బయట పడిందని పోలీసులు తెలిపారు.రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు చెందిన జబరా రామ్‌ను ఓ కేసులో పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలతో సంబంధం ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుమిత్ కుమార్ గురించి తెలిసింది. ఇతడు అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలో చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో మల్టీ టాస్కింగ్ వింగ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వాయుసేన రహస్య సమాచారాన్ని పాక్‌కు చేరవేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. డబ్బు కోసమే దేశ భద్రతను తాకట్టు పెట్టినట్లు వెల్లడించారు.సుమిత్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు నిమిత్తం జైపూర్‌కు తరలించారు. అతడికి 2023 నుంచి పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు చెప్పారు. వారి నుంచి డబ్బు తీసుకొని యుద్ధ విమానాలు, క్షిపణుల వ్యవస్థ, ఎయిర్‌ఫోర్స్ అధికారులు, ఉద్యోగుల కీలక సమాచారాన్ని పాక్ హ్యాండ్లర్లకు అందించినట్లు తేలిందని పేర్కొన్నారు.



విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం"
అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

## 'ధురంధర్ 2' ఏఐ పోస్టర్‌తో వివాదం.. రణవీర్ సింగ్‌పై సిక్కుల ఫిర్యాదు



బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ కొత్త వివాదంలో చిక్కుకున్నారు. ఆయన నటించిన 'ధురంధర్ 2' సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక ఏఐ జనరేటెడ్ పోస్టర్‌పై సిక్కు సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ పోస్టర్ తమ మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఆరోపిస్తూ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ పోస్టర్‌లో రణవీర్ సింగ్ 'కిరాత్‌పూర్ సింగ్' అనే సిక్కు యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. అయితే, ఏఐతో రూపొందించిన ఈ చిత్రంలో సిక్కు గురువుల చిత్రాలను, పవిత్ర మత చిహ్నాలను అగౌరవపరిచే విధంగా ఉపయోగించారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. తమ చరిత్ర, సంస్కృతి, మత విశ్వాసాలతో ఆటలాడటం సరికాదని, ఇది సమాజంలో అనవసర ఘర్షణలకు దారితీస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఫిర్యాదులో కేవలం రణవీర్ సింగ్ తో పాటు సినిమా దర్శక నిర్మాతలు కూడా బాధ్యత వహించాలని, వారిపై చర్యలు తీసుకోవాలని సిక్కు సంఘాల ప్రతినిధులు కోరారు. అయితే, ఈ వివాదంపై రణవీర్ సింగ్ వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## ఆ వీడియోలకు, మాకు ఎలాంటి సంబంధం లేదు



ప్రముఖ గాయని మంగ్లీ పేరు చెప్పి కొందరు వ్యక్తులు మైక్రోఫైనాన్స్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై మంగ్లీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఒక సుదీర్ఘ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తన ప్రొఫెషనల్ ఈవెంట్స్ మినహా తనకు ఎలాంటి ఇతర వ్యాపారాలు లేవని, ముఖ్యంగా మైక్రోఫైనాన్స్ రంగంతో తనకు కానీ, తన కుటుంబానికి కానీ ఎటువంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేసింది.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ కట్టలకు సంబంధించిన వీడియోలకు, తన ఇంటికి ఎటువంటి సంబంధం లేదని మంగ్లీ క్లారిటీ ఇచ్చింది. కావాలనే తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ శాఖను ఆమె కోరారు.తన పేరు వాడుకుంటూ ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే నమ్మవద్దని మంగ్లీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులతో తనకు ఎలాంటి పరిచయాలు లేవని తేల్చిచెప్పింది. తన తమ్ముడిని లేదా తనను కేవలం షోలు, ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం మాత్రమే చాలా మంది సంప్రదిస్తుంటారని, అది కేవలం ఆ ప్రోగ్రామ్ ఆహ్వానాల వరకే పరిమితమని వివరించింది. అంతకు మించి వారి వ్యక్తిగత వ్యాపారాలతో తమకు సంబంధం లేదని పేర్కొంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.